క్లుప్తంగా

వేంకటేశ్వరాలయ క్యాలెండర్ల ఆవిష్కరణ



గుడ్లవల్లేరు: భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన నూతన క్యాలెండర్లను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు మంగళవారం ఆవిష్కరించారు. మెయిల్ చైర్మన్ పామిరెడ్డి పిచ్చిరెడ్డి(పి.పి.రెడ్డి), రమా దంపతులు, మేఘా, మంజరి, పి.వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి గౌరీ నోములు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలో తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో జరగనున్న సావిత్రీ గౌరి నోములు ముక్కనుమ మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. పురోహితులు జంధ్యాల పాండురంగశర్మ ఇంటి వద్ద విజయవాడకు చెందిన పురోహితులు జోశ్యుల శ్రీ హనుమంత కృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సామూహికంగా ముత్తయిదువలు నోములు చేశారు. ఇందులో భాగంగా వేకువజామున అమ్మవారి బొమ్మలతో మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం చేశారు.

విజేతలకు బహుమతీ ప్రదానం



తోట్లవల్లూరు: యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని పమిడిముక్కల సీఐ ఎం. కిషోర్ బాబు పేర్కొన్నారు. పెనమకూరులో భారత యువజన సంఘం ఆధ్వర్యాన కోడిపందేలు, జూదానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన 37వ వార్షిక సంక్రాంతి పోటీలు ముగిశాయి. మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం రాత్రి బహుమతీ ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. వాలీబాల్, షటిల్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీల విజేతలకు సీఐ కిషోర్‌బాబు, ఆర్డీసీ రాష్ట్ర డైరెక్టర్ మర్రెడ్డి శిల్పారెడ్డి బహుమతులను అందజేశారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను పారిశ్రామికవేత్త తెల్లాకుల శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శన, డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు, ఎస్ఐ జి. రమేష్, భారత యువజన సంఘం అధ్యక్షుడు యోహాను పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టాఫీసులో ఆధార్ సేవలు

మండవల్లి: మండవల్లి సబ్‌పోస్టాఫీస్‌లో బుధవారం నుంచి ఆధార్‌కు సంబంధించి అన్ని సేవలు పునరుద్ధరించనున్నట్లు సబ్ పోస్ట్ మాస్టర్ సీహెచ్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

అవనిగడ్డ: ఆటోలో మర్చిపోయిన పర్సును ప్రయాణికుడికి అందజేసి ఆటోడ్రైవర్ షేక్ నాగూర్ బాషా నిజాయతీని చాటుకున్నాడు. స్థానిక లంకమ్మ మాన్యంలో ఉంటున్న గిరిజన యువకుడు శ్రీను మరి కొంతమందితో కలిసి కోడూరు మండలం మాచవరానికి ఆటోలో వెళ్లారు. వారిని మాచవరంలో దించివేసిన అనంతరం ఆటో డ్రైవర్ తిరిగి అవనిగడ్డకు చేరుకున్నాడు. ఆటో స్టాండ్‌కు వచ్చి చూడగా లోపల పర్సు కనబడింది. వెంటనే దీనిని ఆటో స్టాండ్ యూనియన్ నేతలతో కలిసి సీఐ శ్రీనివాస్‌కి అప్పగించారు. అందులో రూ.11 వేల నగదు ఉండగా పర్సు పోగొట్టుకున్న వారిని పిలిపించి అందజేశారు. ఆటో డ్రైవర్ షేక్ నాగూర్ బాషాను సీఐ అభినందించారు.

సమాజానికి శాంతి సందేశం



గుడివాడటౌన్: దేవుని ప్రేమ వ్యక్తి జీవితాన్ని మార్చివేస్తుందని, శాంతి సందేశాన్ని సమాజానికి పంపుదామని అంతర్జాతీయ ప్రసంగికుడు బ్రదర్ అనిల్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఏసుక్రీస్తు ఆశీర్వాద పండుగల సువార్త సభల్లో మంగళవారం ఆయన ప్రసంగించారు. దేవుడి ప్రేమ మాధుర్యాన్ని విశ్వాసులకు వివరించారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు
- పెనుమాకలంకలో గడప గడపకు మన ప్రభుత్వం



గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, వారి అవసరాలు తీర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని పెనుమాకలంకలో సర్పంచ్ ముంగర నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు మోరు వెంకటరమణ ఆధ్వర్యాన డీఎన్నార్ మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో అందజేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. గడప గడపలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా జరగని విధంగా తాము చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల ముందు ఉంచుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల్లో చెప్పని పథకాలు కూడా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డీఎన్నార్ అన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, జంపన వీరబాబు, కమదన నాయనబాబు, నాగదాసి థామస్, ముంగర మల్లికార్జునరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబు రాజు, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

పెదపారుపూడి: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణ పనులపై అధికారులు అలసత్వం వీడి పనుల్లో వేగం పెంచాలని హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండలంలోని వెంట్రప్రగడ, ఈదులమద్దాలి గ్రామాల్లోని జగనన్న కాలనీ లేఅవుట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో నెల్లాఖరులోపు 70 శాతం ఇళ్ల బేసిమెంట్ పనులు పూర్తి చేయాలన్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

- మండలంలోని వెంట్రప్రగడ శివారు పూలవర్తిగూడెంలో ఇళ్ల నిర్మాణ పనులపై డీఆర్‌డీఏ పీడీ శివరాం ప్రసాద్ మంగళవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. బిల్లులు త్వరితగతిన లబ్ధిదారులకు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అయ్యప్పల ఇరుముళ్లు



ఇరుముడితో శబరిమలకు పయనమైన మాలధారులు

కోడూరు: అయ్యప్ప మాలధారులు ఇరుముళ్ల కార్యక్రమాన్ని మంగళవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి 50 మంది మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం ప్రత్యేక వాహనంలో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతుడు నాగకార్తీక్ రెడ్డి

గూడూరు: కంకటావ సమీపంలో ఈనెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పామిరెడ్డి వెంకట నాగ కార్తీక్ రెడ్డి (27) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గూడూరు హెడ్ కానిస్టేబుల్ కమాల్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ రెడ్డి ఈనెల 15వ తేదీ రాత్రి స్నేహితులతో కలిసి సినిమా చూసేందుకు ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం బయలుదేరాడు. గూడూరు మండలం కంకటావ గ్రామం దాటిన తర్వాత కార్తీక్‌రెడ్డి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో కార్తీక్‌రెడ్డి తలకు బలమైన గాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతనిని స్నేహితులు బందరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోమాలోకి వెళ్లిన కార్తీక్ రెడ్డిని మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్‌రెడ్డి మంగళవారం మృతిచెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం



కన్నుల పండువగా సాగుతున్న అమ్మవారి గ్రామోత్సవం

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడు పేరంటాలమ్మ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. రామవరప్పాడులో అమ్మవారి గ్రామోత్సవం పూర్తయిన తర్వాత ప్రసాదంపాడు గ్రామంలో ప్రారంభమైంది. ఈ గ్రామోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత పేరంటాలమ్మ ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం ప్రారంభమైంది. రామవరప్పాడు పుర వీధుల్లో అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ప్రస్తుతం ప్రసాదంపాడులో జరుగుతోంది. రథాన్ని భక్తులు అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18వ తేదీ సాయంత్రం పేరంటాలమ్మ గ్రామోత్సవం పూర్తవుతుంది. అదే రోజు రాత్రి వంతెన సెంటర్ లోని రైవస్ కాలువలో అమ్మవార్ల తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రథోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుట్టా రామచంద్రరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలపై చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడు రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన నిర్మించిన భవనాన్ని సీఆర్‌డీఏ అధికారులు మంగళవారం ధ్వంసం చేసేందుకు చర్యలు చేపట్టారు. నిర్మాణానికి సీఆర్‌డీఏ అనుమతి ఉన్నా నిబంధనలు అతిక్రమించారనే అభియోగంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేయటంతో సీఆర్‌డీఏ అధికారులకు న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాల మేరకు భవనాన్ని ధ్వంసం చేసేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. అయితే భవన యజమాని కోర్టును ఆశ్రయించటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.

బల్లిపర్రులో పశువైద్య శిబిరం

గన్నవరం రూరల్: తెంపల్లి శివారు బల్లిపర్రు గ్రామంలో మంగళవారం కృష్ణా మిల్క్ యూనియన్, ఎన్టీఆర్ పశువైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులతో పశువులకు సకాలంలో చికిత్స అందించాలని, సంవత్సరానికి ఒక దూడ పుట్టేటట్లు చూసుకోవాలని రైతులకు సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, నరేంద్రనాథ్, పశుసంవర్ధక శాఖ ఏడీఏ కె.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. శిబిరంలో 15 సాధారణ, 6 శస్త్ర చికిత్స, 85 గర్భకోశ వ్యాధుల పశువులను పరీక్షించి జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం మంగళవారం జరిగింది. పాఠశాలలో 1983–84 పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. గతంలో స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాండురంగ స్వామి ఆలయంలో భజనలు



పాండురంగస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: స్థానిక చిలకలపూడిలోని పాండురంగస్వామి ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం కొమనగిరి పట్నానికి చెందిన భక్తులు మంగళవారం విచ్చేశారు. గ్రామంలోని ప్రహ్లాదబాబా ఆశ్రమానికి చెందిన వీరు పాండురంగస్వామి ఆలయానికి విచ్చేసి పాండురంగస్వామి కీర్తనలు, కృష్ణుడిపై పాటలు, భజనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు వాణీకృష్ణ, ఆదిరెడ్డి, బుచ్చిబాబు, లక్ష్మణరావు, ఈశ్వర రెడ్డి, సూరిబాబురాజు పాల్గొన్నారు.

నేడు నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

మచిలీపట్నంటౌన్: రుస్తుంబాదలోని భద్రాద్రి శ్రీరాములు వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకట కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అనుముకొండ శ్రీధర్, ధర్మకర్తల మండలి సభ్యులుగా వేప రామస్వామి, అశ్వధాటి పూర్ణచంద్రరావు, తాడివాక పద్మ, అలగలశెట్టి విజయ, కేశన బేబిసరోజిని, దిట్టకవి బాలశేష కృష్ణమాచార్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ పాల్గొంటారని తెలిపారు.

రేపు వేమన పద్య పోటీలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు పి.విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలలో నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు గుర్తింపు కార్డులతో గురువారం ఉదయం 9 గంటలకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రైతులకు హమాలీ చార్జీల చెల్లింపు

మంగళాపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు హమాలీ చార్జీలు సకాలంలో చెల్లించిందని మంగళాపురం పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ వద్ద రైతులకు హమాలీ చార్జీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతుభరోసా కేంద్రం ద్వారా ఈనెల 6వ తేదీ వరకు ధాన్యం విక్రయించిన రైతులు 150 మందికి రూ.2,28,980 రాష్ట్ర ప్రభుత్వం అందించిందని నాగిరెడ్డి తెలిపారు. త్రిసభ్య కమిటీ పర్సన్ ముఖర్జీ, సొసైటీ సీఈఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించాలి



పెదమద్దాలి(పామర్రు): క్రీస్తు మార్గాన్ని అందరూ అనుసరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. పెదమద్దాలిలో మంగళవారం సీబీసీఎన్‌సీ కల్వరి బాప్టిస్ట్ చర్చి నూతన మందిరం ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం నిర్వహించారు. జ్ఞానమణి మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి దయ క్షమ గుణాలను కలిగి ఉండాలన్నారు. పాస్టర్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేతనాలను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సహాయం

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు కుటుంబానికి రూ.10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని చైర్‌పర్సన్ కొలుసు పాములు మంగళవారం అందజేశారు. బ్యాంకులో రుణం పొంది మరణించిన రైతు కూచిపూడి బాబూరావు కుటుంబానికి ఈ సహాయం అందించారు.

గ్రీన్ విలేజ్‌లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన



వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కైకలూరులోని వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌ను మంగళవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) హౌసింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీర్లతో కలిసి సందర్శించారు. లే అవుట్‌లో విద్యుత్ లైన్లు, ఇళ్ల నిర్మాణ పురోగతిని ఇంజినీర్లతో సమీక్షించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. కాలనీలో రెండువైపులా 40 అడుగుల రోడ్డు ముఖద్వారాల వద్ద నిర్మిస్తున్న ఆర్చిల నిర్మాణాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ డీఈఈ రామయ్య, హౌసింగ్ ఏఈ శేఖర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లంక భూముల రైతులకు మేలు జరిగేలా చర్యలు

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): నదీ పరివాహక ప్రాంతంలోని లంక భూముల్లో సేద్యం చేస్తున్న వేలాది మంది రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. లంక భూములకు సంబంధించి జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో చర్చించిన అనంతరం మంగళవారం పేర్ని నాని మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో ఆ ప్రాంత రైతులు సాగు చేసుకుంటున్నారని, వారికి హక్కులు కల్పించే విషయంపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లంక భూముల కేటగిరీలు మార్చేందుకు ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించిందన్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, రివర్ కన్జర్వేటర్లతో కమిటీ ఏర్పాటు చేసి భూముల కేటగిరీల మార్పుపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్‌కు సిఫార్సు చేయనున్నారని తెలిపారు. ఈ సిఫార్సుల ఆధారంగా కలెక్టర్ దీనిపై నిర్ణయం తీసుకుంటారన్నారు. వీటి కారణంగా లంక భూముల రైతులకు మేలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. గట్టుకు దగ్గరగా ఉండి, వరద వచ్చినా కొట్టుకుపోని భూమి ఎ-కేటగిరీగా, ఎ-కేటగిరీకి ఆనుకుని ఉన్న భూములను బి-కేటగిరీగా, నదిలో భూమి ఉండి వరదలు వస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సి-కేటగిరీగా విభజించారని చెప్పారు. సి-కేటగిరీ భూమిని అనుభవిస్తున్న రైతులకు ఐదు సంవత్సరాల లీజుకు ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. అలాగే ఆరు లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా మునగని భూమిని కూడా లీజుకు ఇచ్చే ప్రతిపాదనపై గత నెల 30న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో మంగళవారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. రంగవల్లులు, మ్యూజికల్ చైర్, స్లో సైక్లింగ్ పోటీలు జరిగాయి. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి. వాసవి, ఆర్. లక్ష్మి, పి. కాంచనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఐద్వా సంఘ నాయకులు రత్నకుమారి, ఎం. శ్రీనివాసరావు, ఎం. పద్మ, ఎస్. విజయలక్ష్మి, సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పరారైన విద్యార్థిని గంటల వ్యవధిలో పట్టివేత



విద్యార్థి లియోన్‌ను తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ నుంచి పరారైన విద్యార్థిని హనుమాన్‌జంక్షన్ పోలీసులు గంటల వ్యవధిలోనే పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే.. ఘంటసాల గ్రామానికి చెందిన తరకటూరి లియోన్ (12) వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులు ముగియటంతో మంగళవారం విద్యార్థి లియోన్‌ను తల్లి దుర్గ పాఠశాలలో వదిలిపెట్టి తిరిగి స్వగ్రామానికి బయలుదేరింది. మార్గంమధ్యలో ఉన్న ఆమెకు పాఠశాల నుంచి లియోన్ తప్పించుకుని వెళ్లిపోయాడని ఉపాధ్యాయులు ఫోన్‌లో తెలియజేశారు. దీంతో తల్లి దుర్గ హుటాహుటిన బస్సు దిగి హనుమాన్‌జంక్షన్ కూడలి వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సుందరరావుకు తన కుమారుడు పాఠశాల నుంచి పరారైనట్లుగా తెలియజేసింది. వెంటనే ఆయన జంక్షన్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన తన సిబ్బందితో వెంటనే రంగంలోకి దిగి, గాలించగా లియోన్ ఆచూకీ దొరికింది. ఇంటిపై బెంగతో తిరిగి వెళ్లిపోయేందుకు ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్న లియోన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విద్యార్థికి ఎస్ఐ వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తల్లి దుర్గకు అప్పగించారు.

సంస్కృతి పరిరక్షణే రామదండు ధ్యేయం



గూడూరు: భారతీయ సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణే ధ్యేయంగా రామదండును ఏర్పాటు చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ధన్వంతరీ ఆచార్య అన్నారు. మండలంలోని తరకటూరులో వీహెచ్‌పీ ఆధ్వర్యంలోని రామదండు సంస్థ తరకటూరు విభాగాన్ని ఆయన స్థానిక సాయిబాబా మందిరంలో ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించడంతోపాటు వారిని దైవ చింతన వైపు మరల్చేందుకు రామదండు దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో తరకటూరు ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, టీటీడీ ధార్మిక మండలి జిల్లా కార్యదర్శి తురగ ప్రసాద్, రామదండు వ్యవస్థాపకుడు, పూర్వవిద్యార్థులు యర్రంశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిమ్మకూరులో ఎన్టీఆర్ వర్ధంతి

నిమ్మకూరు(పామర్రు): ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో బెంగుళూరుకు చెందిన అఖిల భారత తెలుగు అకాడమి, పామర్రు కళా పరిషత్ సహకారంతో నందమూరి తారక రామారావు శత జయంతి మహోత్సవాలలో భాగంగా ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కోఆర్డినేటర్లు పీఎంఎస్ ప్రసాద్, వైఎస్ఎన్ ప్రసాద్, కోగంటి వెంకటేశ్వరప్రసాద్, మరీదు హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసుధ బసవేశ్వరరావు విరచితమైన ఎన్టీఆర్ జీవిత కవితా మాలిక, విశ్వ విఖ్యాత పుస్తకావిష్కరణ చేస్తున్నామని పేర్కొన్నారు.